www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 22 జనవరి 2025

5

అన్నమయ్య

మామిడి కొమ్మా.. పూత ఏదమ్మా

- వాతావరణ మార్పులతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం
- మామిడి తోటల కొనుగోలుకు ఆసక్తి చూపని వ్యాపారులు
- పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని దిగులు చెందుతున్న రైతులు

మల్లెపూలతో సింగారించినట్టుగా పచ్చని మామిడి చెట్లు పూతతో కళకళలాడుతూ కనిపించాల్సి కాలమిది. రకాలు..చెట్ల వయసు ఆధారంగా నవంబరు నుంచి డిసెంబరు నెలాఖరు వరకు పూత పట్టాలి. జనవరిలో గుత్తులుగా విరగ్గాయాలి. ఇంత వరకు జిల్లాలో ఎక్కడా ఈ పరిస్థితి కానరావడం లేదు. జాడలేని మామిడి పూత వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, అధిక వర్షాలు, చలి తీవ్రత, పొగమంచు ప్రభావం మామిడి పూతపై తీవ్రంగా పడింది. దీని ప్రభావం మామిడి దిగుబడిపై పడనుంది. మామిడి కొమ్మకు ఏమైందో..మధుర ఫలం దక్కుతుంతో లేదోనని ఇట్లు రైతుల్లో, అటు వ్యాపారుల్లో గుబులు రేగుతోంది.

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లా పరిసర ప్రాంతాల్లో భారీ ఎత్తున మామిడి తోటల పెంపకం ఎక్కువగా ఉంది. ఎంతో ఆశగా వేలాది ఎకరాలలో మామిడి తోట సాగు చేస్తున్న రైతాంగానికి నాలుగేళ్లుగా పంట దిగుబడి లేక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. 2020 నుండి 2022 చివరి వరకు దాదాపు రెండేళ్ల పాటు కరోనా లాక్‌డౌన్ కారణంగా రైతులు డీలా పడ్డారు. ఈ ఏడాది అన్నా రైతులు మామిడి పంట ఆశించిన స్థాయిలో జనవరి చివరి వారం వచ్చినప్పటికీ నేటికీ కూడా మామిడి పూత కనపడకుండా పోవడం రైతుల పాలిట శాపంగా మారింది. చాలా ప్రాంతాల్లో మామిడి తోటలో చెట్లకు తెగులు, నల్ల మంగుతో పాటు పూత కూడా అనుకున్నంత స్థాయిలో రాలేదు. జనవరి నెలకు భారీగా తోటలన్నీ పూతలతో కలకలాడాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. ఇప్పటివరకు 25 శాతం కూడా మామిడి పూత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూత కనపడకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఈ జిల్లా నుండి మామిడి పంటలు దిగుబడి మద్రాసు, ముంబయి, బెంగళూరు, విజయవాడ, హైదరాబాదు తదితర ప్రాంతాలకు మామిడికాయలను ఎగుమతి చేస్తారు. గతంలో మామిడి పంటను కొనుగోలు చేసి రైతులకు డబ్బులు ఇచ్చి వారి తోటలను ముందస్తుగానే కొనుగోలు చేసేవారు. నేడు పూత కనపడకపోడం కొనుగోలుదారులు కూడా ఎవరు ముందుకు రావడం లేదు. మామిడి రైతులు దిగాలిపడ్డారు. చెట్లకు దుక్కులు, మందు కొట్టేందుకయ్యే కూలీలు ఖర్చులు కూడా అధికమయ్యాయి. పెనుభారంగా ఈసారి మామిడి కాపు మారింది. ఏది ఏమైనప్పటికీ అనుకున్నంత స్థాయిలో మామిడి పంట జిల్లాలో మామిడి పూత రాకపోవడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.

చలి, మంచు ప్రభావం

గతంలో డిసెంబర్ మాసంలోని మామిడి చెట్లకు పూత పూసి, కాయలతో చెట్లు కళకళలాడేవి. ఈ ఏడాదిలో తుపాన్, చలి, మంచు వాతావరణ కారణం వలన జనవరి చివరికి వచ్చినప్పటికీ మామిడి చెట్లకు ఇప్పటి వరకు 25 శాతం మాత్రమే కూడా పూత రాలేదు. గతంలో డిసెంబర్ జనవరి మాసాలలో చలి, మంచు ప్రభావం ఉన్నప్పటికీ ఉన్నప్పటికీ రాత్రి పగలు ఉష్ణోగ్రత తేడాగా ఉండేది. ప్రస్తుతం రాత్రి, పగలు చలి ఎక్కువుగా ఉండడం వలన మామిడి పోత తగ్గింది అని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

89 వేల ఎకరాల్లో మామిడి తోటలు

జిల్లాలో 89,667.5 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. జిల్లాల్లో చిట్వేలిలో 4,400 ఎకరాలు, రైల్వేకోడూరులో 9217, ఓబులవారిపల్లిలో 1625, పెనగలూరులో 3380, పుల్లంపేటలో 490, మదనపల్లిలో 1475, నిమ్మనపల్లిలో 2050, రామసముద్రంలో 1500, గుర్రంకొండలో 4145, కలకడలో 3445, కలికిరిలో 2737, కె.వి.పల్లిలో 4625, పీలేరులో 3500, వాల్మీకిపురంలో 2875, నందలూరులో 1780, రాజంపేటలో 935, టి.సుండుపల్లిలో 7590, వీరబల్లిలో 5262, చిన్నమండెంలో 6250, గాలివీడులో 2300, లక్కిరెడ్డిపలిల్లో 6000, రామాపురంలో 3582, రాయచోటిలో 222, సంబేపల్లిలో 3075, బి.కొత్తకోటలో 715, కురబలకోటలో 750, ములకలచెరువులో 625, పెద్దమండెంలో 1960, పిటిఎంలో 542, తంబళ్లపల్లెలో 750 ఎకరాల్లో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. ప్రతి ఏటా దాదాపు రూ.200 కోట్లకు పైగా విలువైన దిగుబడులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. ఈ సారి అధిక వర్షాలు, గాలులతో వాతావరణంలో మార్పులతో దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూత రాని మామిడి చెట్లు

ఖర్చులు పెరిగి పోయాయి

మామిడి పంట సాగు చేయాలంటే ఖర్చులు పెరిగిపోయాయి. మామిడి చెట్లకు దుక్కి చేయడం, నీరు కట్టడం, వాటికే ఎరువులు, స్ప్రేలు, అధిక ధరలు అయినాయి. కూలీలు కూడా అధికమయ్యాయి. పెట్టిన పెట్టుబడి కూడా మామిడి పంటలో రావడం లేదు. గతంలో జనవరి మాసంలోని వ్యాపారస్తులు మామిడి తోటలో కొనేవారు. ఈసారి వ్యాపారస్తులు తోటవైపు ఎవరు రావడం లేదు. ప్రభుత్వం స్పందించి మామిడి పంటలు ఉన్న రైతులను ఆదుకోవాలి.

- భాస్కర్ నాయుడు, రైతు, రామాపురం.

ఇబ్బందిగా ఉంది

నాలుగు సంవత్సరాలుగా మామిడి పంట సరైన దిగుబడి లేక ఇబ్బందిగా ఉంది. వేరు శనగ, వరి పంటలు కూడా వర్షాలు లేక పంట లు చేతికి రావడం లేదు. కనీసం మామిడి పంటలో అయినా చేతికొస్తాదనుకుంటే జనవరి మాసం చివ రన చివరైనా పూత రాలేదు. పెట్టిన పెట్టుబడులు రావడం లేదు.

- రెడ్డయ్య, రైతు, రాయచోటి.

రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలి

జిల్లాలో మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. మామిడి చెట్టుకు పూత అరకొరగా ఉన్న ఆ పూత కూడా రాలిపోవడం రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడే కరువు మండలాల గా ప్రకటించిన మండలాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి. మామిడి తోట సాగు చేసిన రైతులను గుర్తించి నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలి.

- రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, రాయచోటి.

ఈ ఏడాది పూత తక్కువ

వాతావరణం మార్పిడి వలన ఏడాది పూత తక్కువగా వచ్చింది. ఏడాదిలో వర్షాలు కూడా తక్కువగానే పడ్డాయి. జిల్లాలో మామిడి పంటకు 20 శాతం మాత్రమే పూత వచ్చింది. 10, 15 రోజులు వరకు 35 శాతం పుత వచ్చే అవకాశం ఉంది. మిల్టీస్ప్రే చేయాలి. 1 లీటర్‌కు 10 గ్రాములు వేయాలి. వచ్చిన పూతను నిలుపుకోవాలి. ఈ సారి పుత తక్కువగా వచ్చే అవకాశం ఉంది.

- పి.రవి చంద్రబాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, రాయచోటి.

రాయచోటిలో దారుణం

బాలికపై లైంగిక దాడి గర్భం దాల్చడంతో అబార్షన్ నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్/రాయచోటి

16 ఏళ్ల బాలిక.. ఆపై హెచ్ఐవి బాధితురాలిగా ఉన్న ఓ చిన్నారికి మాయమాటలు చెప్పి లొంగదీసుకొని గర్భవతిని చేసిన సంఘటన అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో చోటు చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రాయచోటి మండలం పెమ్మాడపల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికకు తల్లిదండ్రుల ద్వారా హెచ్ఐవి సోకింది. కొన్నాళ్ల కిందట తల్లిదండ్రులు మృతి చెందారు. ఆమె ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో ఆమె మందుల కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి వస్తూపోతున్న సమయంలో ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా ట్రెనింగ్ చేస్తున్న విజయ్ కుమార్ ఆమెకు మాయమాటలు చెప్పి లోబర్చుకొని ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె గర్భం దాల్చింది. ఆమెకు కౌన్సెలింగ్ ఇస్తున్న కౌన్సిలర్ బాలిక గర్భం దాల్చిన విషయాన్ని బంధువులకు తెలిపారు. వారు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆమెను చేర్పించారు. వారు అక్కడి నుండి స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి నిందితుడు వినయ్ కుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు సుండుపల్లి మండలం జంగంపల్లికి చెందిన టి.విజయ్ కుమార్ రాయచోటి పట్టణంలోని ఓ ప్రయివేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బిఎస్‌సి, ఎంఎల్‌టి చదువుతున్నాడు. ఈ క్రమంలో విజయ్ కుమార్ ల్యాబ్ టెక్నీషియన్ ట్రెనింగ్ కోసం 2022 సంవత్సరంలో రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చేరాడు. అక్కడ పనిచేస్తున్న సమయంలో 10వ తరగతి చదువుతున్న బాధిత బాలిక నెలనెలా హెచ్ఐవి నివారణ మందుల కోసం ఆసుపత్రికి వస్తున్న సమయంలో విజయ్‌కుమార్ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

బాలిక అత్యాచారంపై డిఎస్‌పి విచారణ

రాయచోటిలో బాలికపై జరిగిన అత్యాచార సంఘటనపై డిఎస్‌పి కృష్ణమోహన్ మంగళవారం విచారణ చేపట్టారు. బాలికపై జరిగిన అత్యాచార సంఘటనపై రాయచోటి పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు విషయంపై రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, కడప రిమ్స్ ఆస్పత్రులలో బాలికకు జరిగిన సంఘటనపై డిఎస్‌పి విచారణ చేశారు. హెచ్ఐవి బాధితురాలిగా ఉన్న ఆ చిన్నారికి అందుతున్న వైద్యం, బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్ విధినిర్వహణపై ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో కలిసి ఆరా తీశారు.

సిపిఎం చేపట్టిన సామూహిక దీక్షలో పాల్గొన్న వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు, ప్రతినిధులు

ప్రభుత్వాస్పత్రిని కాపాడుకుందాం

- సామూహిక నిరాహార దీక్షలో సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిని ప్రయివేటు పరం చేయాలని కూటమి నాయకులు పన్నుతున్న పన్నాగాలను తిప్పి కొట్టి ప్రభుత్వాస్పత్రి ప్రయివేటు పరం కాకుండా పరిరక్షించు కోవాల్సిన బాధ్యత పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరిపై ఉందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. మదనపల్లె వైద్య కళాశాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు జరుగుతున్న కుట్రలను పసిగట్టిన సిపిఎం వందేళ్ల చరిత్ర కలిగిన మద నపల్లె ప్రభుత్వాస్పత్రి, మెడికల్ కాలేజ్ ప్రయివేటు పరం కాకుండా అడ్డుకునేందుకు, మదనపల్లె ప్రజలను చైతన్యం చేసేందుకు మూడు రోజుల పాటు సామూహిక నిరాహార దీక్షలకు పిలుపు నిచ్చింది. ఈ మేరకు ఆస్పత్రి ముందు టెంట్ వేసి దీక్షలకు పూనుకున్నారు. మొదటి రోజైన మంగళ వారం సామూహిక దీక్షలకు ఐటియుసి, బిఎస్‌పి, సిపిఐ, విసికె, బాస్, బహుజన సేన, సిఐటియు, పెన్షనర్స్ అసోసియేషన్ ఎఐటియుసి సంఘాలు మద్దతిస్తూ ఆ పార్టీల నాయకులు దీక్షలో పాల్గొని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కాలేజ్‌ను ప్రభుత్వమే నిర్వహించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వందేళ్లుగా ఎంతో మంది పేదలకు ఉచిత వైద్యాన్ని అందించిన మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నేడు దయనీయ స్థితికి చేరుకోవడంలో కూటమి పెద్దల కుట్ర దాగుందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ సంస్థలను, వ్యవస్థలను కార్పొరేటర్లకు అప్పచెప్పి, దారాదత్తం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి పెద్దలు ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి, కార్పొరేటర్లకు కట్టబెట్టి పేదల పొట్ట కొట్టేలా చూస్తున్నారన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజీని రద్దు చేశారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని రాజకీయ కుట్రలో భాగంగా రద్దు చేయడం దురదృష్టకరం, దుర్మార్గమన్నారు. ఎన్‌డిఎ, కూటమి ప్రభుత్వ పెద్దల కార్పొరేట్ పైత్యం దేశానికి చాలా ప్రమా దకరమన్నారు. మంజూరై పనులన్నీ పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సర్వజన బోధనాస్పత్రిని రద్దు చేసిందంటే బిజెపి పెద్దల కార్పొరేట్ పైత్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసు కోవాలన్నారు. 44 మంది వైద్యులు, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 24 మంది స్టాఫ్ నర్సులు, సిబ్బందిని బదిలీ చేశారన్నారు. క్రమక్రమంగా ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందిని పూర్తిగా తగ్గించి, వైద్య సేవలను నిర్వీర్యం చేసి ఆ తరువాత ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నా యన్నారు. ఇప్పుడు మేలుకోకపోతే నష్టం జరిగిపోయిన తర్వాత ఏమి చేయలేమని కావున మదనపల్లె పట్టణ ప్రజలందరూ ఏకమై, కుల మతాలకతీతంగా, పార్టీలకతీతంగా ఉద్యమించి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఇక్కడే ఉండేటట్లు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వైసిపి హయాం లో మంజూరైన మెడికల్ కాలేజ్ రద్దవుతోంటే ఆ పార్టీ నాయకులు నిద్రపోతున్నారా అంటూ నిలదీశారు. ప్రశ్నిస్తే ఎక్కడ జైలుకు పంపుతారోనన్న భయంతో వారు దాక్కున్నారని, ఆ భయాన్ని వీడి మీ ప్రభుత్వంలో మంజూరైన మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కాలేజీని నిలబెట్టుకునేందుకు ముందుకు వచ్చి పోరాటం చేయాలని సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, బిఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్, సిఐటియు నాయకులు హరింద్రనాథ్ శర్మ, ఐటియుసి కన్వీనర్ జి.కృష్ణమూర్తి, బహుజన సేన నాయకులు శ్రీచందు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నర్సింహులు, బాస్ నాయకులు ముత్యాల మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి, నాగరాజు, రఘునాథ్, సీఐటీయూ నాయకులు రామక ృష?, రాజు, బిఎస్పి నాయకులు మిద్దేపల్లి బాలాజి, ఏఐటీయూసీ నాయకులు సాంబశివ, సిపిఐ నాయకులు క ృష?ప్ప, మురళి, బాస్ నాయకులు రెడ్డి ప్రసాద్, గంగాధర్, ప్రజాసంఘాల నాయకులు మునివెంకటప్ప, ఉత్తన్న, ఆంజప్ప పాల్గొన్నారు.

పురస్కారాలు అందుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు

'చింతా'కు జ్యోతిష్య సామ్రాట్ బిరుదు ప్రదానం

ప్రజాశక్తి-పీలేరు

చిత్తూరు జిల్లా పెనుమూరు గ్రామానికి చెందిన చింతా రుక్మాంగద రావుకు 'జ్యోతిష్య సామ్రాట్ బిరుదును, పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక, సినీ రంగ కళాకారుడు ఖాదర్‌బాషాకు 2025 సంవత్సరానికి గాను నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఐకాన్ అవార్డును ప్రదానం చేశారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ పంచమ వార్షికోత్సవం, సావిత్రిబాయి పూలే 194వ జయంతి పురస్కరించుకుని సోమవారం హైదరాబాదు రవీంద్ర భారతి ప్రధాన రంగ వేదికపై ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లో నిష్టాతులై, సమాజానికి ఉపయోగపడుతున్న 60 మంది ప్రముఖులను సంస్థ గుర్తించి, వారు చేస్తూన్న సేవా రంగాలను అనుసరించి, వేర్వేరు పురస్కారాలతో వీరిని సత్కరించుకుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా, పీలేరు మండలం, రేగళ్ళు గ్రామానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త వై.షామీర్ కు భారతదేశ మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయిని, షేక్ ఫాతిమా జాతీయ ఐకాన్ అవార్డు, తిరుపతి జిల్లా, తిరుపతికి చెందిన డాక్టర్ సోము ఉమాపతికి గేయ రచయిత వేటూరి సుందర్రామూర్తి జాతీయ ఐకాన్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్ గౌడ్, అతిథులుగా ప్రముఖ న్యూమరాలజీ, ఆస్ట్రాలజిస్ట్ దైవజ్ఞ శర్మ, డాక్టర్ రఘు అరక పూడి, న్యాయవాది జి.రవి ప్రకాష్, సినిమా, టివి కళాకారిణి జ్యోతి స్వరూప్, మా అసోసియేషన్ ఇసి సభ్యులు మాణిక్ రావు, లీగల్ అడ్వైజర్ జ్యోతి, సినీ దర్శకులు గుర్రపు విజయ్ కుమార్, తెలంగాణ ఉద్యమ కారిణి సాజిదా సికిందర్, అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్. సరోజనమ్మ చేతుల మీదుగా పురస్కారాల ప్రధానం చేస్తూ, జ్ఞాపిక, ధ ృవపత్రం, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత రజ్నీ లీజు, సామాజిక సేవా కార్యకర్తలు, కళాకారులు, విద్య, వైద్య రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఎంఎస్‌ఎంఇల సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంఎస్‌ఎంఇల సర్వేను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికా రులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎంఎస్‌ఎంఇల సర్వే అంశంపై జిల్లా పరిశ్రమల శాఖ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో కలెక్టరు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఇ) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంఎస్‌ఎంఇ సర్వే 2024ను ప్రభుత్వం తిరిగి ప్రారంభించడం జరిగిందని, అందువల్ల అన్ని పరిశ్రమలు, సేవా రంగాలు, వ్యాపార సంస్థలు ఉద్యం రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వేలో భాగంగా డివిజన్ స్థాయిలోని ట్రేడ్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేసి అవగాహన సమావేశాలు నిర్వహిం చాలన్నారు. ఈ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు పరిశ్రమల శాఖ అధికారులు మరియు కమర్షియల్ టాక్స్ శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. పోటీతత్వ పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించడానికి ఈ సర్వే ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రభుత్వం పరిశ్రమ అవసరాలపై స్పష్టమైన అవగాహన పొందడానికి ఎంఎస్‌ఎంఇ యూనిట్లలో సాంకేతిక ఉత్పత్తి మరియు నిర్వహణ నైపుణ్యాలలో గలకారణాలను గుర్తించడానికి ఈ సర్వే ప్రక్రియను లక్ష్యంగా పెట్టుకున్నదని కలెక్టర్ తెలిపారు. వ్యాపార కార్యకలాపాల అన్ని వివరాలు సర్వే యాప్లో పొందుపరచడం వల్ల దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని తెలు సుకొనుటకు అవకాశం ఉంటుందన్నారు. సచివాల యాల పరిధిలోని సిబ్బంది అందరూ ఎంఎస్‌ఎంఇ సర్వేలో పాల్గొ నుటకు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. మండలాల వారీగా ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. సమా వేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కృష్ణారావు, జిఎస్‌డ బ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పరిహారం పంపిణీ పూర్తి చేశాం

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు భూ పరిహారం పంపిణీ వేగంగా పూర్తి చేస్తున్నట్టు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్‌కు వివరించారు. విజయవాడ సచివాలయం నుంచి రాష్ట్రంలో జాతీయ రహదారుల భూసేకరణ, అటవీ భూముల కేటాయింపు, కోర్టు కేసుల అంశంలో జిల్లాల వారీగా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శ్రీధర్, జెసి ఆదర్శ్ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో జాతీయ రహదారుల ప్రగతిని సిఎస్‌కు వివరించారు. ఎన్‌హెచ్ 440 రాయచోటి నుంచి వేంపల్లి వరకు చేపట్టిన రహదారికి సంబంధించి 95 శాతం భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. ఇందులో భూములు కోల్పోయిన రైతులకు నష్టప రిహారం కింద రూ.11 కోట్లకు భూమి రాశి పోర్టల్‌లో నమోదు చేశామని పేర్కొన్నారు. త్వరలోనే ఆయా రైతుల ఖాతాల్లో నష్టపరిహారం జమ అవుతుందని చెప్పారు. ఎన్‌హెచ్ 716 కడప - రేణిగుంట నాలుగు వరసల రహదారి విస్తరణలో భాగంగా జిల్లాలో వెళ్తున్న జాతీయ రహదారికి సంబంధించి దాదాపు 80 శాతం భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. అలాగే ఎన్ హెచ్-71, మదనపల్లి- పీలేరు సెక్షన్ నాలుగు వరసల రహదారికి సంబంధించి కూడా 90 శాతం భూ సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. ఆయా ప్రాజెక్టులలో ఇంకను మిగులు ఉన్న భూసేకరణకు చర్యలు వేగవంతం చేశామన్నారు. పరిహారం చెల్లింపుకు సంబంధించి సంబంధిత రైతులు సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన వెంటనే వారికి కూడా పరిహారం చెల్లింపు చేశామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

స్కౌట్స్, గైడ్స్ క్లబ్ మాస్టర్స్‌కు శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె

అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో క్లబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్ల శిక్షణ కార్యక్రమం ఈ నెల 21 నుంచి 27వ తేదీ వరకు జిఆర్‌టి హైస్కూల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ ప్రారంభించి పిల్లల్లో సేవా భావాన్ని పెంపొం దించాలనే ఉద్దేశంతో విద్యాశాఖ కమిషనర్ వారి ఆదేశాల ప్రకారం ప్రతి పాఠశాలలో కూడా ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారని పేర్కొన్నారు. జిఆర్‌టి హైస్కూల్ నందు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం మొదలైందన్నారు. జిల్లాలోని పలు పాఠశాల నుంచి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అందరూ కూడా హాజ రయ్యారని తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ గైడ్ కెప్టెన్సీ ఇన్‌ఛార్జి శకుంతల, మదనపల్లి ఎంఇఒ రాజగోపాల్, అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చంద్రశేఖర్ పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ఉపాధ్యాయిని ఉపాధ్యా యులు అందరూ పాల్గొని ఈ సేవా కార్యక్రమంలో తమ వంతు పాలుపం చుకుంటామని ఈ సందర్భంగా తెలియ జేశారన్నారు.

IN LOVING MEMORY OF

Naga Lakshumma Jonnagadla

Date of Demise: Jan 3, 2025

"For in that Sleep of death
What dreams may Come!"

Son : Raja Gopal Naidu Jonnagadla
Grand Son : Sandeep Jonnagadla
Grand Daughter : Srujana Jonnagadla
and Family & Friends

మాట నిలుపుకున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విశాఖ ఉక్కు విషయంలో ప్రభుత్వం మాట నిలుపుకుందని, ఎపి ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మేందుకు సర్వం సిద్ధం చేసిందని అసెంబ్లీలో మంత్రిమండలి సైతం తీర్మానించిందని, అయితే అప్పట్లో ప్రతిపక్షాల పెద్దఎత్తున పోరాటం చేయడంతో కాపాడుకోగలిగామన్నారు. ప్రస్తుతం కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, అందుకుగాను రూ.11,400 కోట్ల నిధులు మంజూరు చేయడం శుభ సూచికమన్నారు. వైసిపి విధానాలతో అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ పూర్తిగా వెనుక బడిపోయిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారని కొనియాడారు. వైసిపి నాయకులు, ఆ పార్టీ అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి తమ ఉనికిని కాపాడుకోవడానికి కూటమి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీని రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని స్పష్టం చేశారు. అనంతరం రామసముద్రం మండలం నుండి తిరుమల పాదయాత్రకు వెళ్తూ క్యూలైనులో గాయపడిన ఇరువురికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్, నాగూర్ వలి, షంషీర్, బాలుస్వామి, కౌన్సిలర్ నాగార్జున బాబు, నవీన్ చౌదరి, మాకినేని చంద్రశేఖర్, కత్తి లక్ష్మన్న,చుక్కా విజయ్ కుమార్, బీదం గురునాథ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

డిఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

రెడ్డిపల్లెలో ప్యాసింజర్ రైళ్లను నిలపాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

బ్రిటిష్ కాలంనాటి రెడ్డిపల్లె రైల్వే స్టేషన్‌లో కరోనా కంటే ముందుగా నిలుస్తున్న ఇంటర్‌సిటి, అరకోణం ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని గుంతకల్ డిఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాను కోరినట్లు గుంతకల్ రైల్వే బోర్డు సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డిఆర్‌ఎం కలిసి వినతిపత్రం అం దించినట్లు తెలిపారు. రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, చెన్నై ఎక్స్ ప్రెస్, రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని కోరినట్లు తెలిపారు. పేదలకు ఎంతగానో ఉప యోగపడే మరికొన్ని ప్యాసింజర్ రైళ్లు ను ఈ మార్గంలో ప్రవేశపెట్టాలని డిఆర్‌ఎం దృష్టి కి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇంటర్‌సిటి, ప్యాసింజర్ రైలు రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల శ్రేయస్సు కోసం ప్రత్యామ్నాయంగా కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలన్నారు. నంద్యాల డెమో ప్యాసింజర్ రైలు పుల్లంపేట మం డల కేంద్రంలోనూ, అనంతరాజుపేట, శెట్టిగుంట రైల్వే స్టేషన్లలో స్టాపింగ్ సౌకర్యం కల్పిం చాల్సింది చెప్పామని అన్నారు. రాజంపేట రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వే సమస్యలపై డిఆర్‌ఎంకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు.

పింఛన్ల తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

విభిన్న ప్రతిభావంతుల పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని విభిన్న ప్రతిభావంతుల పింఛన్లను అధికారులు తనిఖీ చేపట్టారు. మంగళవారం నిమ్మనపల్లి పంచాయతీలో 1, 2 సచివాలయాల్లో ప్రతి నెల రూ.15వేలు పింఛన్ పొందుతున్న మంచానికే పరిమి తమైన విబిన్న ప్రతిభా వంతులను డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి, డాక్టర్ ఎ.రామరాజు, డిజిటల్ సహాయకులు అష్రఫ్ షేక్ బృందం పరిశీలించినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణరెడ్డి తెలిపారు. నిమ్మనపల్లి పంచాయతీలో 19 పింఛన్లు ఉండగా వాటన్నింటిని పరిశీలించి పూర్తి వివ రాలు ఉన్నతాధికారులకు తెలిపారు. మండలంలో మొత్తం 153 మందికి రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న వారిని పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రామరాజు, పంచాయితీ కార్యదర్శి వెంకటరమణరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో విభిన్న ప్రతిభావంతుల పెన్షన్లపై తనిఖీ నిర్వహించారు. కడపకు చెందిన డాక్టర్లు రామ్మోహన్, సునీల్‌దత్ కోసువారి పల్లి పిహెచ్‌సి డాక్టర్ మనీ కుమార్‌ల బృందం కుక్కరాజుపల్లి కోటకొండ, వేణుమాకులపల్లి, కన్నెమడుగు, ఎద్దులవారి పల్లి, పంచాయతీలలో 29 మంది పింఛన్ దారుల ఇంటి వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిలపై పరిశీలించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ్య హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కిడ్నీ, బిపి, డయాబెటిక్ సంబంధించిన సమస్యలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రముఖ డాక్టర్ ప్రియా కాళహస్తి అమెరికా నుంచి హాజరయ్యారు. డాక్టర్ బృందం మాట్లాడుతూ చాలామంది ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. 24నమరల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-నందలూరు

తోపుడు బండ్ల వారు, రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునేవాళ్లు, ఆటోలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎఎస్ఐ శంకర్‌నాయక్ హెచ్చరించారు. మంగళవారం బస్టాండ్‌లో వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు గురించి అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, లైసెన్స్, వాహన రికార్డులు కలిగి ఉండాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తినప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామరాజు, హోంగార్డు మేరీ పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి బాలికల హాకీ టీం ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లి

ఈ నెల23న స్థానిక బి.టి. కళాశాల, మదనపల్లె హాకీ మైదానంలో లో గురువారం ఉదయం 9గంటలకు అన్నమయ్య హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలికల సబ్ జూనియర్ హాకీ టీం ఎంపిక జరుగుతుందని అధ్యక్షులు పి.వి. ప్రసాద్, సెక్రటరీ శివప్రసాద్ తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు1-1-2009 తేదీ తరువాత పుట్టినవారు అయ్యిఉండాలని, వారి వెంట, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, తప్పక తీసుకొని రావాలని సూచించారు. అలా తెచ్చిన వారు మాత్రమే ఎంపిక ప్రక్రియకు అర్హులని కన్వీనర్ హితేశ్ రావు, ట్రెజర్.ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఎంపిక అయిన టీం .అనంతపురం ఆర్‌డిటిలో 27 నుంచి జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని, వివరాలకు 9441152481 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ లక్ష్యం

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి -రాయచోటి : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వయోజనవిద్య శాఖ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్ర మానికి సంబంధించిన అక్షర వెలుగులు, మార్గదర్శినిలు, వాల్ స్టిక్కర్, కేలండర్‌లు, అటెండెన్స్ రిజిస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ గ్రామ మండల జిల్లాస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్ది అన్నమయ్య జిల్లాలో వంద శాతం అక్ష రాస్యత సాధించి రాష్ట్రంలో ఒక రోల్ మోడల్‌గా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, రాయచో టిలోని డైట్‌లో జిల్లాలోని ఎంపిడిఒలు, ఎపిఎంలకు ఉల్లాస్ కార్యక్రమం పైన జిల్లాస్థాయి ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరిగింద తెలిపారు. జిల్లాలో అభ్యాసకులుగా నమోదైన 13,767 మందిని అక్షరాసులుగా చేయడమే లక్ష్యంగా ఎంపిడిఒలు, ఎపిఎంలు శిక్షణ పొందారని జిల్లా కలెక్టర్‌కు వివరిం చారు. కార్యక్రమం గతంలో లాగా కాకుండా టిసిఎస్ వారి ఆధ్వర్యంలో 45 వీడి యోల ద్వారా అభ్యాసకులకు రోజు ఒక గంట సేపు తరగతులు జరుగుతాయని అన్నారు. కార్యక్ర మంలో జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌ఛార్జి మల్లు వెంకటసుబ్బారెడ్డి, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I Pottapati Sailaja (Old Name), w/o Pottipati Sankara Narayana Reddy R/o 3/33. Ragavarajupuram v & post, Railway kodur mandal ANNAMAYYA (Dist), AP. I have been changed my name as Pottipati Sailaja w/o Pottipati Sankar Reddy (New Name).

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని బాలసానివాండ్లపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్ర మంలో ఎడిఎ జయరాణి పాల్గొన్నారు. స్థానిక గ్రామ రైతులతో కలిసి వ్యవసాయ పొలాలకు వెళ్లి వేరుశనగ పంటను పరిశీలించి సస్యరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు పంటలు వేసుకుని మొదట నుంచి పంట నూర్పిడి చేసేంతవరకు ఎప్పటికప్పుడు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల పై దృష్టి సారించాలని సూచించారు. తద్వారా వేసిన పంటలలో పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడి సాధించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయమే లాభసాటిగా ఉంటుందని తెలిపారు. ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఘన జీవామృతం పంటలకు అందించడం వల్ల మంచి దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వీరబల్లి: వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎడిఎ జయరాణి

నప్స్ యాప్ రైతులకు ఉపయోగం

రామాపురం : పంటలను ఆశిస్తున్న చీడపీడల పర్యవేక్షణకు నప్స్ యాప్ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగమణి తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లి, సరస్వతిపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ యాప్‌తో పంట లలో చీడపీడల పర్యవేక్షణ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పండించిన మిరప, అల సంద పంటలలో చీడపీడలను ఈ యాప్ సాయంతో ఎలా గుర్తించవచ్చో అవగాహన కలిగిం చారు. చీడపీడలు పంటకు ఏ స్థాయిలో నష్టం కలిగిస్తుందో రైతులే గుర్తించి, నివార ణకు ఎలాంటి మందులు ఎంత మోతాదులో వాడాలో అనే విష యాన్ని ఈ యాప్ ద్వారా మెసేజ్‌ల వివరాలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని అప్పయ్య రాజుపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎఒ శ్రీకర్ తెలిపారు. తహశీల్దార్ అరవింద కిషోర్ ఇ-పంట నమోదు చేసిన రైతు రవీంద్ర ఖాతా నెంబర్ 167, సర్వేనెంబర్ 94-1 లో అలసంద పంటను సూపర్ చెక్‌లో పరిశీలించారని చెప్పారు. రైతులకు ఇ-పంట నమోదు ప్రాముఖ్యత, పంటలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి మస్తాన్ మాట్లాడుతూ రైతులందరూ కూడా ప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సుశీల్ కుమార్, మండల సర్వేయర్ శ్రీరాములు, వి.ఎ.గాయత్రి, శీను, రైతులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ పీడీపై చర్యలు తీసుకోవాలి :'సిటు'

మాట్లాడుతున్న సిహెచ్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-పుల్లంపేట

జిల్లాలోని అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు గత రెండు నెలలుగా జీతాలు రానివ్వకుండా విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన ఐసిడిఎస్ పీడీ రమాదేవిపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎ.రామానుజులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పీడీ రమాదేవి తీరు అనుమానాస్పదంగా, వివాదాస్పదంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి వర్కర్లు ఎటువంటి తప్పులు లేకపోయినా రికార్డులు తీసుకెళ్లి ఆఫీసుకు రమ్మనడం వెనుక అంతర్యం ఏమిటో తేల్చాలన్నారు. సెంటర్లకు వచ్చిన పదివేలు కూడా సకాలంలో ఇవ్వక పదేపదే ఆఫీసుకు తిప్పుకుంటున్నారని అన్నారు. వన్ స్టాప్ సెంటర్‌లో ఉద్యోగులు సెలవు కావాలంటే ఏదో ఒకటి చెల్లించాలని అలా ఇవ్వని ఒక ఉద్యోగురాలికి షోకాజ్ నోటీస్ ఇచ్చారనే ఆరోపణలు కూడా చర్చించుకుంటున్నారని అన్నారు. గత నెలలో ఇచ్చిన నోటిఫికేషన్ లో భారీ స్థాయిలో ముడుపులు అందాయనే అనుమానాలకు తావిస్తోందని అన్నారు. ప్రమోషన్లకు అర్హత ఉన్న పీడీ నిబంధనలు ఉల్లంఘించి హెల్పర్లకు అన్యాయం చేశారని, రోస్టర్లు తారు మారు చేశారని జిఒ ఉన్నా ట్రాన్స్‌ఫర్ చేయలేదని పేర్కొన్నారు. అనేక అవకతవకలతో వచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి రీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్వాడీ కార్యకర్తలకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి సిఐటియు ముందుం టుందని పేర్కొన్నారు.

పశువులకు నట్టల నివారణ మందు వేయించాలి

రామాపురం: పశువులకు నట్టల నివారణ ముందు వేస్తున్న డిడి కొండయ్య

ప్రజాశక్తి-రామాపురం

పశువులకు నట్టల నివారణ మందు తప్పక వేయించాలని పశు సంవర్ధక శాఖ డిడి మాలకొండయ్య పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీ బి.రాచపల్లి, కన్నపువాళ్లపల్లిలో మంగళవారం మండల పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పశువు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డిడి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే పశుఆరోగ్య శిబిరాలను పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 2643 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. 32 దూడలకు, 54 ఆవులు గేదెలకు వైద్యం అందించారు. కార్యక్రమంలో మండల పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులు పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలోని నాయినివారిపల్లెలో పశు వైద్యాధికారి నాగరాజు ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరంఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో 774 గొర్రెలకు, 47 పశువులకు నట్టల నివారణ ముందు తాపించామని, 25 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసినట్లు తెలిపారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నిర్వహించి పశువులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. రైతులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. **తంబళ్లపల్లి :** పశువులను పోషించే రైతులు వాటికి వచ్చే వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఎడి సుమిత్ర తెలిపారు. బాలొండ్డిగారి పల్లె గోసువారిపల్లెల రైతు సేవ కేంద్రాల వద్ద ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. 71 పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. నట్టల నివారణకు, 235 ఆవులకు 115 దూడలకు, 115 గొర్రెలకు మందు తాపారు. పశు పోషణలో తీసుకోవాల్సిన మెలకువలపై వివరిం చారు. కార్యక్రమంలో ఎంఎబిసి డాక్టర్ ఇందు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లి : పశువులకు వైద్యం చేయిస్తున్న కాపరులు

హామీల అమలు ఎప్పుడో ? : 'గడికోట'



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

ఎన్నికల సమయంలో కూటమిప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారోనని కోసం రాష్ట్ర ప్రజానీకం ఎదురుచూస్తోందని, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గువ్వలచెరువులో మంగళవారం వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు. రైతులకు పెట్టుబడి నిధి కింద రూ.20 వేలు, ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి రూ.18వేలు, తల్లికి వందనం, యు వతకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. అనంతరం ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వైసిపి మైనార్టీ నాయకులు భాషఖాన్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తల సంక్షేమ కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సమిష్టిగా పనిచేసి పార్టీని బలోపేతం చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో గోపగుడిపల్లి సర్పంచ్ ముంగర సుబ్బయ్య, పందిళ్ళపల్లి బలరామయ్య, ఎంపిటిసి మౌలాలి మండల కో-ప్షన్ మెంబర్ జిలాని, రేకంనారాయణ, శివయ్య, అయూబ్ , మాజీ ఎంపిటిసి రాజా, కసిరెడ్డిగారిపల్లె ఉప సర్పంచ్ శివయ్య, ముబారక్,సుబ్బయ్య, ఓబులేసు, డాక్టర్ రమణ, చిన్నయ్య, శేఖర్, సిరాజ్, మహమ్మద్‌గౌస్, పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణతో సమన్యాయం చేయండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఎస్‌సి వర్గీకరణతో సమన్యాయం చేయాలని ఏక సభ్య కమిషన్ కమిటీ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు నిమ్మనపల్లి మండల ఎంఆర్‌పిఎస్ నాయకులు గణేష్, రెడ్డి ప్రసాద్, హరి, మల్లేశ్వర, మాల మహానాడు జిల్లా కార్యదర్శి వీరనాల మాణిక్యం, నాయకులు సుధాకర వినతి పత్రాలను అందించారు. మంగళవారం చిత్తూరులో ఎస్‌సి వర్గీకరణపై అభ్యంతరాలను, సూచనలు, సలహాలను ఎస్‌సి వర్గాల ప్రజలు, నాయకుల నుంచి ఏక సభ్య కమిషన్ కమిటి స్వీకరించింది. నిమ్మనపల్లి మండలం నుంచి ఎంఆర్‌పిఎస్ నాయకులు, మాల మహానాడు సంఘాల నాయకులు వినతి పత్ర రూపంలో తమ అభిప్రాయాలను అందించామని తెలిపారు. షెడ్యూల్ కులాలలోని ప్రజలు సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ పరంగా వెనుకబాటు పడి ఉన్నారని ఎస్‌పి వర్గీకరణతో వారికి న్యాయం చేయాలన్నారు. ఏక సభ్య కమిషన్ కమిటీ ఎస్‌సి వర్గాల లోని ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి కూలంకుషంగా పరిశీలించి వెనుకబడిన షెడ్యూల్ కులాలకు న్యాయం చేస్తుందని అభిప్రాయపడ్డారు. **పీలేరు:** షెడ్యూల్ కులాల వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ నాయకులు ఏకసభ్య కమిటీకి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఎస్‌సి వర్గీకరణ చేసే కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వన్ మాన్ కమిషన్ చైర్మన్‌గా రాజీవ్ రంజన్ మిశ్రాని నియమించడం జరిగిందన్నారు. ఈ కమిషన్ 21న ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకున్న సందర్భంగా పీలేరు నియోజకవర్గం నుంచి ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, కో-ఇన్‌ఛార్జి ముల్లంగి రెడ్డప్ప, అమరాల వెంకటరమణ ఆధ్వర్యంలో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కమిషన్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 30 సంవ త్సరాలుగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల వర్గీకరణ కోసం అలుపెరగని ఉద్యమాలు చేసిన ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఏక్ సభ కమిషన్ నియమించడం చాలా గర్వించదగ్గ విషయమని చెప్పారు. కార్య క్రమంలో ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు ముస్తూరు విశ్వనాథ, చరణ్, గంత బాల కృష్ణ, గురు ప్రసాద్, రాము, యువ నాయకులు గండికోట రెడ్డి కుమార్, నరసింహ, అన్నవరం, భాస్కర, నాగరాజ, రాజశేఖర్, రవిశ్వరయ్య, ముత్యాలు, కృష్ణయ్య పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: రాజీవ్ రంజన్‌మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల అధ్యాపక బృందం

జాబ్‌మేళాలో 20 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

స్థానిక పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహిం చిన జాబ్ మేళాలో 20 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్తీవ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించగా 40 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 20 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు కూడా అందించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల చివరి నుంచి వారు ఎన్నిక కాబడిన ఉద్యోగాలకు సంబంధించి శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. తమ పూర్వ విద్యార్థులు ఎంపిక కావడం మీద కళాశాల ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య, డైరెక్టర్ పి.శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి అడపాల శివకుమార్, అధ్యాపకులు పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని గట్టు పంచాయతీ, నాయన బావికి చెందిన వైసిపి కార్యకర్త కె.చంద్రశేఖర్‌రెడ్డి అనారోగ్యం కారణంగా కుడి చేతికి శస్త్రచికిత్స చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంగళవారం నాయనబావిలో ని మృతుడి కుటుంబానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి,యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని పరామర్శించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా తనకు సమా చారం ఇవ్వాలన్నారు. వారికి సంక్షేమానికి ఎల్లప్పుడూ ముందు ఉంటా నని చె ప్పారు. కార్యకర్తలే తనకు ప్రత్యేక బలమని, కష్టకాలంలో వారికి అండగా నిల వాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. నియో జక వర్గంలో మండల సర్వ సభ్య సమావేశాలను కూటమి నాయకులు అడ్డుకుంటూ అభివృద్ధికి విఘాతం కలి గిస్తున్నారని, ప్రజాస్వామ్యానికి ఇది మంచి సంకేతం కాదన్నారు. తమ పార్టీ అధి. కారంలో లేకున్నప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తు న్నామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ప్రభాకర్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన వైసిపి నాయకులు

రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కలికిరి : మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలికిరి మండల వైసిపి నాయకులు భేటీ అయినట్లు వైసిపి జిల్లా ఎస్సీ సెల్ నాయకులు వి.హరి తెలిపారు. మంగళవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకె అందించి శాలు వాతో సన్మానించామని తెలిపారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన జరుగుతుందని వచ్చే ఎన్నికల్లో వైసిపి గెలవడం ఖాయమని, నాయకులు కార్యకర్తలు అధైర్య పడవద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, నాయకులు మహేందర్ రెడ్డి, మధురెడ్డి, రత్న శేఖర్ రెడ్డి, జెఎసి వ్యవస్థాపకులు హనీఫ్, భాను ప్రకాష్, డ్రైవర్ విజయ్, డిజె శ్యాముల్, మధు పాల్గొన్నారు.

సిఐకు వినతిపత్రం ఇస్తున్న నరసింహ ప్రసాద్

టిడిపి కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

నియోజకవర్గంలో టిడిపి కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరిగిన సహించేది లేదని టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబులవారిపల్లి మండలం రాళ్లచెరువుపల్లిలో ఇటీవల కొంతమంది టిడిపి అని, వైసిపి అని పార్టీలు మారుతూ సూర్యప్రకాష్ నాయుడుకు సంబంధించిన భూమిని చంగయ్య, లక్ష్మయ్య కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని రైల్వే కోడూరు రూరల్ సిఐ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కబ్జా చేసే వారికి ఎటువంటి ఆన్‌లైన్‌గానీ, పాస్‌బుక్‌లు గానీ లేవని అన్నారు. కేవలం కొందరి అండదండలతో భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శాంతియుతంగా భూమి వ్యవహారాలు న్యాయ విచారణ చేసి న్యాయం చేయాలని సిఐ వెంకటేశ్వర్లకు వినతిపత్రాన్ని అందించినట్లు తెలిపారు. టిడిపిలో ఉండి కూడా తమ అనుచరులకు అన్యాయం జరిగితే సహించనని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు. భూ కబ్జాలంటే సిఎం సహించరని అన్నారు. కార్యక్రమంలో సూర్య ప్రకాష్ నాయుడు, కస్తూరి దినేష్ చౌదరి, ఎస్‌కె.గౌస్, అంకిపల్లి మధు, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-నందలూరు

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎఎస్ఐ శంకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల కళా శాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు, మహిళల కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాలు, డ్రగ్స్, సైబర్ క్రైమ్ తదితర నేరాల గురించి తెలిపారు. బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.నాగేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

- మహిళ అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 48 మందు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. మండలంలోని కోన పంచాయితీ కోనకు చెందిన ప్రమీల అనే మహిళ బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో దాడులు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్టు చేసినట్లు తెలిపారు. మండలములో ఎక్కడ గాని బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. బెల్ట్ షాపులు నిర్వహించేందుకు సహకరించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేద అన్నారు. దాడులలో ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.